# స్పందన

అతను అలా అప్పుడు రైల్లో కలవక బోతేఇప్పుడు ఇలా ఈ కథ రాయవల్సిన అవసరం ఉండేది కాదు.

ఉద్యోగరీత్యా రాయలసీమలోని కర్నూలుకు బదిలీ అయ్యాను. అప్పటి దాకా నేను సర్కారు జిల్లాల్లో, హైద్రాబాద్‌లో పని చేసి ఉండటం వలన ఆ జిల్లాలకు ఈ జిల్లాకు ఉన్న తేడా ఏమిటో యిట్టే పట్టేశాను.

సాయంత్రం అయితే ఎక్కడికి పోవాలో అర్థం అయ్యేదికాదు. పగలల్లా ఆఫీసు హడావిడితో కాలం చెల్లిపోయేది. కాని ఎటొచ్చి సాయంత్రాలు గడపడం చాలా కష్టంగా ఉండేది. ఎన్నిసార్లు అని సినిమాలు చూడను? నేను చూస్తున్నానని వాళ్ళుతొందర తొందరగా కొత్త పిక్చర్లు తెప్పించలేరుగా. పైగా సినిమా చూసినప్పుడల్లా చాలా వెలితిగా ఫీలయ్యే వాడిని.

స్వర్గంల్లాంటి నెల్లూరు సినిమాహాళ్లల్లో, విజయవాడ- హైద్రాబాద్ సిటీల్లోని ఏసీ టాకీసుల్లో సినిమాలు చూసి, కర్నూలులోని థియేటరులో సినిమా చూస్తే- రాజును చూసిన కళ్ళతో మొగుడ్ని చూస్తే, అన్నంత చికాకు కలిగేది.

సీట్లుబావుండవు. అప్పర్‌క్లాసులకు కూడ నెంబర్లు యివ్వరు. టికెట్టు దొరికినా సీటుదొరకదు. అన్నీ బావున్నాయనుకుంటే బొమ్మ సరిగా కనపడదు. కార్బన్ రాడ్స్ మార్చకపోయినా ఎవరూ పట్టించుకోరు. బొమ్మషేకయినా, సౌండులో క్లారిటి లేకపోయినా పట్టించుకోకుండా పరమానందంతో చూసే ప్రేక్షకుల్ని చూస్తే నాకు పిచ్చెక్కేది.

అవిధంగా నాకు సినిమాల పైన ఉన్న గౌరవం పోగొట్టు కోవడం యిష్టం లేక సినిమాలు చూడడం బాగా తగ్గించేశాను.

మధ్య తరగతి మనిషికున్న ఏకైక వినోద సాధనం మానేసరికి నిజంగానే సాయంత్రాలు ఎలా గడపాలని పొద్దున్నుండే దిగులు ముంచుకొచ్చేది.

రాయలసీమను రాళ్ళసీమని ఎందుకంటారో నాకు అవగతం అవసాగింది. కర్నూలు త్రిడీలకు ప్రసిద్ధి! విజ్ఞానం పెరగని కాలంలోనే త్రిడీ కర్నూలుకు ఎలా వచ్చింది అని ఏమాత్రం ఆశ్చర్యపోనక్కరలేదు. ఎందుకంటే డాక్టర్, డాంకీ, డస్టులకు కందనవోలుఖ్యాతి నార్జించింది కనుక.

అలా అనంత విశ్వంలో రాకెట్‌లో ఒంటరిగా ప్రయాణం చేస్తుట్లు ఆరు నెలలు గడిపేశాను.

చివరికి ఓ సాహితీ సంస్థను స్థాపించి- చుట్టూ వున్న చీకటిని తిట్టుకోకుండా ఓచిరుదీపం వెలిగించి - నాకు తోచిన సేవ చేద్దామనిపించింది.

ఉత్సాహవంతులైన మిత్రులను కలిశాను. వాళ్లచేతి చమురు భాగోతం లేని ఏ ప్రక్రియ చేయడానికైనా తమ సంసిద్ధత తెలియచేశారు.

మొదటిసారిగా ఓ పార్కులోని చెట్టు కింద సమావేశమయ్యాం. కొన్ని చర్చలు అయిన తరువాత పార్థసారథి తన అమూల్యమైన అభిప్రాయంసెలవిచ్చాడు.

"సాహిత్యం తగలబడిపోతున్న ఈ రోజుల్లో ఈ వారం ఫలానా పత్రికలో రసశ్రీ గారి అరుణోదయం అద్భుతంగా ఉంది."

"సాహిత్యం తగలబడిపోతున్నదని ఎదుకను కుంటున్నావు?" నేను అడ్డుకున్నాను - అతను అలా విమర్శించడం నచ్చక

"ఎందుకా? నేను కొన్ని పత్రికల్లో వేస్తున్న సాహిత్యాన్ని సెన్సార్ వారికి పంపిసేంత సంస్కారం చేస్తారు కనుక." చెప్పాడు.

"అవును. ఆ మధ్య ఓ పత్రిక యింటికి తీసుకుపోయాను. మా శ్రీమతి ఒకటే సణిగింది. బూతు పత్రికలు యింటికెందుకు తెస్తారండీ అని" చెప్పాడు శేషగిరి - అతనికి కొత్తగా పెళ్ళయింది.

"అసలు మీ క్లబ్ లో యిలాంటి పత్రికలు కూడ తెప్పిస్తారాని కొందరు ఆశ్చర్యపోతున్నారు." అనందరావు కూడ తన స్వీయ అనుభవాన్ని వివరించేడు.

"చూడండి. పెద్దలకు మాత్రమే అని పత్రిక మీద ఎక్కడా రాసి వుండదు. పైగా సంసార పక్ష పత్రికలు అని కవరు పేజీ మీద వున్నవే మన క్లబ్ కొస్తున్నాయి!" సెక్రటరీగా నేను చెప్పాను.

"మరి పిల్లలకి చదవడానికి పనికిరాని సాహిత్యంని ఏమనాలి?" పార్థసారథి పాయింటాఫ్ ఆర్డర్‌లేవదీశాడు.

"చూడు సారథి! నువ్వు ఎంతో గొప్పగా అభిమానించే ప్రాచీన సాహిత్యంలో కూడ ఎంతో బూతు వుంది. అది అయితే పద్య రూపంలో చెప్పబడింది కాబట్టి చట్టబద్ధమైంది పాఠకుల దృష్టిలో. నేడు అవి ఆధునిక, ఆధునిక రచయితలు గధ్య రూపంలో చెబుతున్నారు కాబట్టి మీరు తప్పు పడుతున్నారు. అదే వీరే ఆ భావాల్ని పద్యంగా మల్చి ఉంటే బహుశ మీరే వీర్ని భుజానికి ఎత్తుకుని తిరిగేవాళ్ళేమో!" నా కామెంట్‌తో మా సమావేశం గందరగోళంలో పడిపోయింది. ఎవరికి తోచినట్లు వారు అరవడం - కేకలు పెట్టడం-చేతికందినవి విసరటంతో అసెంబ్లీ వాతావరణాన్ని సృష్టించారు. గత్యంతరం లేక ఆ రోజు అర్థాంతరంగా సమావేశం ముగించాం.

అప్పటికే పార్కులో ఆడుకుంటున్న పిల్లలు షికార్లుడుకుంటున్న పెద్దలు-మమ్మల్లి సంఘవిద్రోహులుగా భావించినట్లున్నారు. మా చుట్టులా వలయంగా చేరారు.

అప్పటి నుండి మా సమావేశాలు పదిమంది ఉండే చోటు కాక - కొంచెం నిర్జనమైన ప్రదేశాన్ని ఎన్నుకొని జరిపేవాళ్ళం.

కాని అప్పుడప్పుడు రసశ్రీ కథల గురించి పొగడ్త వినిపిస్తూనే ఉండేది.

"కొత్త రచయితలాగున్నాడు-అయినా బాగానే రాస్తున్నాడు."

"చక్కటి యితివృత్తాల్ని ఎన్నుకుని -చిక్కటి శైలితో రాస్తున్నాడు."

"బాగా పైకి వచ్చే లక్షణాలున్నాయి!"

"మండుటెండలో మలయమారుతం-"

వాళ్లభిప్రాయాల్తో క్రమంగా నేనూ ఏకీభవిస్తూండేవాడ్ని.

ఓ రోజు నాకు ఆశ్చర్యం కలిగేలా పార్థసారథి రసశ్రీ మీద విరుచుకుబడ్డాడు.

"ఛ( ఛ( ! ఎంత దిగజారిపోయాడు, నాలుగు మంచి కథలు రాశాడనుకుంటే - కళ్ళు నెత్తికొచ్చాయి"

"ఏం జరిగింది ?" శాంతంగా అడిగాను.

"ఆ పత్రిక చూడలేదా? "ఏ పత్రికో చెబ్తూ అడిగాడు.

నేను చూడలేదన్నట్లు తలూపాను.

"ఏకాకి అనే కథ చదువు తెలుస్తుంది ,చాలా చెత్తగారాశాడు. అంతా యింతా కాదు-"

"ఏం? థీమ్ బాగోలేదా?"

"థీమా? అస్సలుందాని?"

"పోనీ-శైలిదెబ్బతిందా?"

"శైలి గంగా ప్రవాహం!"

"అయితే తప్పకుండా శిల్పం తల్పంలా పడుకుని ఉండాలి- అంతే కదూ?"

"ఛ(! ఛ( ! శిల్పమా - కథా? నోటికొచ్చిన కూతలు రాసుకుపోయాడు."

నాకు అర్థం కాక శేషగిరి వంకచూశాను.

"కొంచెం గురూగారు శృంగారం పాలు ఎక్కువ చేశారు" మెలికలు తిరుగుతూ చెప్పాడు.

"ఆ రకంపాలు ఉన్నాయని నాకు తెలీదు "ఆనందరావు ఆదుర్దాగా తన అజ్ఞానం ఒప్పుకున్నాడు.

"మూర్ఖుడా ! పాలుకాదు -పెరుగుకాదు - అది బూతు!" పార్థసారథి చెప్పాడు.

"చూడు సారథి! కథకు అవసరమైతే సమయోచితంగా శృంగారం రాస్తే తప్పులేదు. "నేను చెప్పాను.

"శృంగారం కోసమే కథ రాస్తే ? "అతను ప్రశ్నించాడు.

"అది అంగారం అవుతుంది? "కోపంగా శేషగిరి చెప్పాడు.

"బంగారం కాదా? "కోపంగా అన్నాను. "కథలో రాసే శృంగారం కంటే నిజ జీవితంలో ఎన్నో రెట్లు ఎక్కువుంటుంది. మరి మీరు మరీ యిలా మడికట్టుకుని-"

"శీనూ ! సాహిత్యానికొక ప్రయోజనం అంటూ ఉంటే అది సమాజాన్ని బాగు చేయడం అని నమ్ముతాను." "సారథి నన్ను ఉద్దేశించి చెప్పసాగాడు. "అంతేగాని ధనార్జన కోసం పచ్చి బూతులు రాసి సమాజం మీద వదిలేవాడు ఊమార్ఖుడు కాదని నా అభిప్రాయం."

"శృంగారం కూడ సమాజ శ్రేయస్సులో ఓ భాగం కాదా? " నేనన్న దానికి ఈసారి వాళ్లు తెల్ల బోయారు.

"అదెలా?!"

"కొన్ని దేశాల్లో పిల్లల్ని కంటే యింక్రిమెంట్లు ప్రమోషన్లు యిస్తున్నారు- మన దేశంలో జనాభా నియంత్రణ చేస్తు యింక్రిమెంట్లు యివ్వడంలేదు -పనిష్మెంటు యిస్తున్నారు."

ఇంకావాళ్లు షాక్‌లోనే ఉన్నారు.

"ఎందుకు? వాళ్ళ జాతిని అభివృద్ధి చేసుకోవడానికి. వాళ్ళ దేశంలో విదేశీయుల జనాభ శాతం తగ్గించడానికి. శ్రమశక్తిని పెంచడానికి" చెప్పాను గర్వంగా...

"నిజమే కాని - రచయిత తనున్న సంఘం దృష్టి లో పెట్టుకుని రాయాలి. "రసశ్రీ" బహుశా ఆంధ్రలో నే ఎక్కడో ఉండి ఉంటాడు. మన పరిస్థితులు నువ్వు చెప్పిందానికిభిన్నంగాఉన్నాయి" చటుక్కున పార్థసారథి మెరుపులాంటి పాయింట్ లేవదీయడంతో నానోరు మూతపడింది.

అప్పటి నుండి వాళ్లు 'రసశ్రీ' పట్ల చులకనతో వ్యవహరించసాగారు. దురదృష్టంకొద్దీ 'రసశ్రీ' తరువాతి రచనలు కూడ, నాకు మటుకు నాకు, దిగజారినట్లు అనిపించింది. అందుకని క్రమంగా 'రసశ్రీ' ని ఖండించే వాళ్ళల్లో నేను కూడ కల్సిపోయాను. మా సాహితీ మిత్ర సంస్థ బలపడింది. దీనికి మెంబర్‌షిప్ కూడ వసూలు చేయడం మొదలెట్టాం. మా కార్యక్రమాలు విస్తరింపచేశాం.

ఆ సందర్భంలో హైద్రాబాద్ నుండి ఓ ప్రముఖ కవిని పిలవమని నాకు అర్డర్లు జారీ చేశారు మిత్రులు. ఆయన చాలా బిజీ మనిషి! ఉత్తరాలకు జవాబులిచ్చేంత తీరిక ఉండదు. కాని చక్కని వక్త కూడ కావడం వలన- నేనే పోయి పిలిస్తే తప్పకుండా మా ఊరుకు వస్తాడనే ఆశనాలో చిగురించింది.

తుంగభద్ర ఖాళీగానే పోతుంది హైద్రాబాద్‌కు. అందుకని నేకూడ లీజరుగా వచ్చి రైలు పోయేటప్పుడు ఎక్కి ఓ సీట్లో కూర్చున్నాను. కర్నూలు నుండి హైద్రాబాద్‌కు ఈ తుంగభద్ర చాలా సౌకర్యంగా ఉంటుంది. నాలాంటి జోగారావులు హాయిగా నిద్రపోవచ్చు.

ఖాళీగా ఉన్న సీట్లో పడుకున్నాను - నిద్ర నాకున్నవరం - ఒక్క నిమిషంలో కన్నులు మూతపడిపోయాయి.

ఎవరో లేపుతే లేచి కూర్చున్నాను, "కూర్చోవచ్చా?" ఓ మధ్యపాటి వయసున్న పెద్దమనిషిప్రశ్నిస్తున్నాడు.

"అక్కడంతా ఖాళీగా ఉందిగా నా నిద్రచెడగొట్టాలా?"

"సరేలే - ఆడోళ్ళ పక్కన పోయి కూర్చోమంటావా?"

"తప్పేంటి?" విసుగ్గా అన్నాను మత్తులో

"య్యోవ్! మీ ఆడాళ్ళ పక్కన యింకోడు కూచుంటే ఊరుకుంటావుటయ్యా?" అతను అడిగాడు.

నాకు ఒళ్లు మండింది "గూబ పగులగొడతా!" చెప్పాను.

"అందుకనే - అలా గూబ పగులగొట్టించు కోవడం నాకిష్టంలేదు. ఇక్కడకూర్చుంటాను. నీకిష్టమైతే అక్కడే కూర్చోడానికి ప్రయత్నించు." అన్నాడు ఆడవాళ్ళవైపు చెయ్యిచూపిస్తూ-

వీడెవడో సెమీ క్రాక్‌లాగున్నాడు- నాకెందుకులే అనుకుని నోర్మూసుకుని చోటిచ్చాను- కిటికీకి ఆనుకుని. కాసేపటికి అతను పత్రిక సంచీలోంచి తీసుకుని, చదవడంలో నిమగ్నమైపోయాడు.

కూర్చోవడానికి కొంచెం అసౌకర్యంగా ఉండటం వలన నిద్రకు ఫుల్‌స్టాప్ పెట్టి ఓ ప్రత్యేకసంచిక తీసుకున్నాను. అలా బొమ్మలు తిరగేశాను. ఏదీ చదవ బుద్ధికాలేదు. భద్రంగా నా కాలి కింద పెట్టేసుకున్నాను.

"కొంచెం ఆ పుస్తకం యిస్తారా?" ఆపెద్దమనిషి అడిగాడు.

"ఇవ్వను." ఖచ్చితంగా చెప్పాను – నా నిద్ర చెడగొట్టాడు మరి.

"కొంచెంఇప్పుడే యిచ్చేస్తాను– ఓ కథ చదివి." బ్రతిమాలాడు.

"కొంచెంఊళ్ళో వాళ్ళందరికి యివ్వడానికి కాదండి నేకొంది. నే చదువుకోడానికి!" కరుగ్గాచెప్పాను.

అతను చిన్నబుచ్చుకున్నాడు. నాకు జాలేసింది.

"అంత యింట్రస్టు ఉన్న వాళ్ళు కొనలేకపోయారా?"

"కొందామని ప్రయత్నించాను–ఈసారి చాలా తక్కువ కాపీలు వచ్చినట్లున్నాయి–దొరకలేదు" అతను చెప్పాడు. అతని మాటల్లో నాకు సిన్సియారిటీ కనిపించింది.

మౌనంగా అతని పత్రికందుకుని – నా ప్రత్యేక సంచిక అతనికిచ్చాను. అలవోకగా అతడిచ్చిన పత్రిక చూస్తూనే అతనేం చదువుతున్నాడని ఓరకంట గమనిస్తున్నాను.

అతను 'రసశ్రీ' కథ చదివాడు. చదివి వెంటనే నాకు పుస్తకం వాపసు యిచ్చాడు.

'వెరీ చీప్ టేస్టు' అని మనసులో అనుకున్నాను. పైకి పెద్దమనుషుల్లా కనిపించె వాళ్ళు కూడ రసశ్రీ కథ చదవాల్సిందేనా – వయసు కూడ కాదు.

"అప్పుడే యిచ్చాశారేం ?" యధాలాపంగా అడిగాను.

"నాక్కావలసిన కథ చదివి యిచ్చేశాను–" చెప్పాడు.

"ఏదీ రసశ్రీ కథ సబ్బు బిళ్ళ? "వ్యంగ్యంగా అడిగాను.

"అరె మీకెలా తెల్సు?"

"ఆ మాత్రం తెలీదా? మీలాంటి వాళ్లు ఏది చదువుతారో?" చాలా వ్యంగ్యంగా అతన్ని హీనంగా చూస్తూ చెప్పాను.

కాని – అతను ఎంతో పొంగిపోయాడు. దాన్ని మెచ్చుకోలుగా తీసుకుని తనలో తానే నవ్వుకున్నాడు.

అతనికి కొంచెం పిచ్చి ఉందేమో అనిపించింది.

"మీరు ఆ కథ చదివారా?" కుతూహలంగా అడిగాడు.

"చదవలేదు– చదవను కూడ" రపీమని చెప్పాను.

"మీకు కథలంటే యిష్టం లేదా?" మొహం మాడ్చుకుని అడిగాడు అతను.

"సాహిత్యమంటే నాకు ప్రాణం!" గర్వంగా చెప్పాను.

"చిత్రంగా మాట్లాడుతారు మీరు?"

"నేను సాహితీ మిత్ర సంఘానికి సెక్రటరీని" అంటూ కవిగార్ని పిల్చుకురావడానికి పోతున్న వైనం చెప్పాను.

"చాలా సంతోషం – నాపేరు రవింద్ర మారుమూల పల్లెలో బ్యాంకులో పని చేస్తాను" అతను పరిచయం చేసుకున్నాడు.

"మరి- ఆ కథ ఎందుకు చదివారు?" నేనడిగాను.

"అంటే- బ్యాంకులో పని చేస్తే కథలు చదవకూడదా?"

"అలాగని కాదు- ఆ చెత్త కథ - చదవకూడదని?"

"నా ఉద్యోగానికి - కథకు సంబంధం ఏమిటి?" అతను మొహం గంటు పెట్టుకుని నిలదీశాడు. చెప్పక తప్పింది కాదు.

"బ్యాంకులో పని చేస్తున్నారంటే బాగా చదువుకున్న వారై ఉండాలి - బాగా చదువుకున్న వాళ్ళు సాధారణంగా ఉత్తమ సాహిత్యాన్ని ఆదరిస్తారు. మీరు కూడ ఆ కోవలో చేరి ఉంటారని నేననుకున్నాను."

"ఏం? ఇప్పుడలా అనుకోవడం లేదా?" హీనస్వరంతో అడిగాడు.

"అహ! రసశ్రీ కథ చదివారంటేనే నాకు మీ చీప్ టేస్టు అర్థమయింది. ఆ పుస్తకంలో అంతమంది గొప్ప రచయితల కథలుంటే ముందస్తుగా మీరు ఆ 'సబ్బుబిళ్ళ' చదివారంటే కారణం-"

"కారణం- నేనే రాశాను కాబట్టి!" బులెట్‌లా పేల్చాడు.

ఈ సారి నాకు మతిపోయింది. ఆ షాక్ నుండి తేరుకోవడానికి కొన్ని నిమిషాలు పట్టింది. కొంచెం గుండెల్లో దడ వచ్చింది. ఇందాక నేనేమన్నా తప్పుగా మాట్లాడానా అని ఆలోచించసాగాను.

"చదవకుండానే మీరు నా కథని చెత్తని తేల్చేశారే?" అతని ప్రశ్నలో బాధ - అసంతృప్తి కనిపించాయి.

"ఆ పేరు పట్టి - ఊహించాను" నాన్నాను

"అంటే మీ ఉద్దేశ్యం నే రాసేవన్నీ చెత్తకథలేనా?" కోపంగా అడిగాడు.

అంత దూరం వచ్చిం తర్వాత యింక ఆగదల్చుకోలేదు.

"అన్నీ అని నేను చెప్పను. కొన్ని మాత్రం చెత్త అని ఘంటాపథంగా చెప్పగలను" ఆయన మొహంలో రంగులు మారుతుంటే చెప్పుకుపోయాను. "మీ కథల్లో శృంగారం మితిమీరి ఉంటుంది. మీరే ఉద్దేశ్యంతో అది రాస్తారో నాకు తెలీదు. బహుశ డబ్బుకని నేననుకుంటాను - కాని ఆ వెధవ డబ్బు కోసం మీరు ఈ తుచ్ఛమైన రచనలు చేసి సంఘాన్ని ఎంత పాడు చేస్తున్నారో తెల్సా? ముఖ్యంగా ఎదిగీ ఎదగని వయసులో ఉన్న కుర్రకారు పైన విపరీతంగా ఉంటుంది. ఆ వయసులో వారికి ఆకర్షణ తప్ప విచక్షణ ఉండదు. మనసు ఊరికే పెడదార్లు పడుతుంది. అటువంటి వారిని మీ కథలు రెచ్చగొడతాయి!" నాకు ఆవేశం వస్తే ఒళ్ళు తెలీదు. చెప్పి ఆయన వంక చూసేసరికి ఉబుకుతున్న కన్నీళ్ళను ఆపుకోవడానికి రుమాలు మొహానికి అడ్డం పెట్టుకున్నాడు.

"మరి నా కథలు చాలా గొప్పగా ఉన్నాయని ఎంతో ఆనందించామని ఎన్నో ఉత్తరాలు పత్రికల్లో వస్తూంటాయి - బహుశ మీరు చదివి ఉండరు" తన్ను సమర్థించుకుంటూ ఆయన చెప్పాడు.

"నిజమే! వచ్చే ఉంటాయి - ఎందుకంటే అలా రాస్తే కాని పత్రికల్లో పాఠకులు వారి పేర్లు చూసుకోలేరు. అచ్చులో తమ పేరు చూసుకుందామనే మోజులో అలా ఆకాశానికి ఎత్తేస్తూ ఉత్తరాలు రాస్తారు!" వివరించాను పాఠకుల సైకాలజీ.

అలానా! అయితే నే మోసపోయాను!" ఈ సారి ఆయన కన్నీళ్ళు ఆపుకునే ప్రయత్నం చేయకుండా రుమాలుతో తుడ్చుకున్నాడు. నాకు నిజంగా జాలేసింది. బాగా గాయపర్చినట్లున్నాను.

"మీరు మొదట్లో రాసిన కథలు చాలా బాగుండేవి." చెప్పాను.

ఆయన కళ్ళు మెరిశాయి "నిజంగానా?!"

"ఆ! మేమంతా చదివి ఓ గొప్ప రచయిత పుట్టుకొచ్చాడని గర్వించేవాళ్ళం. మా సమావేశాల్లో తరుచు మీ కథల్లోని గొప్పతనం గురించి చర్చించుకునేవాళ్ళం - కాని మా ఆశలు నీరుకారుస్తు - కొన్నాళ్ళకు మీరు మామూలు ధోరణిలో పడ్డారు."

"మరి నాకథలు అంత బాగా ఉన్నాయని మెచ్చుకున్నప్పుడు మీరు ఉత్తరం కూడా రాయలేదు. నాకు కాకపోయినా కనీసం పత్రిక్కి రాయచ్చుగా."

"అబ్బే! అంత తీరికెక్కడిదండి. పైగా ఉత్తరాలు రాసి పేరు చూసుకోవాలనుకునే మోజు లేదు. మేమంతా బాగా వివేకవంతులం. చదువుకున్న వాళ్ళం - మెచ్యూర్డు బ్రెయిన్సు ఉన్న వాళ్ళం - ఓ వయస్సు వచ్చేసింతర్వాత యిటువంటివి చేయాలనిపించదు." చెప్పాను.

"ఆ! అదే నన్నిలా దిగజార్చింది. మీ లాంటి మంచి పాఠకుల నుండి స్పందన లేకపోయేసరికి నేను నాధోరణి మార్చుకున్నా - కనీసం ఒక్క ఉత్తరం వచ్చినా యింతటి పొరపాటు జరిగేది కాదు-"

ఆయన మాటలకు నేను స్పందించిపోయాను బిక్కమొహంతో.

"అంటే మేం మీకు ఉత్తరాలు రాస్తే కాని తెలీదూ- మీరు రాసింది మంచి కథో ? కాదో?"

"తెలుస్తుంది. కాని పాఠకులు ఆదరించనప్పుడు ఏమవుతుంది? రచయిత ఆత్మవిశ్వాసం దెబ్బ తింటుంది. నేనుండేది ఓ మారుమూల పల్లెటూళ్ళో! అక్కడ సాహిత్యం అంటే ఎవరికీ పట్టదు. నా కథ పడింది అని చెబితే - అయితే నాకేం అన్నట్లు చూస్తారు. కొలీగ్స్‌లో కూడా రసహృదయులు లేరు, ప్రొఫెషనల్ జెలసీ ఉన్న వాళ్ళు తప్ప. అటువంటి పరిస్థితుల్లో నేను పాఠకుల ఉత్తరాలు పట్టి నా కథకు ఎంత గుర్తింపు వచ్చిందో అర్థం చేసుకుంటాను!" అతను చెప్పాడు అతని బాధ.

"కాని మేం విమర్శిస్తూ ఉత్తరం రాశామనుకోండి- పత్రిక సర్క్యులేషన్ దెబ్బతింటుందని ప్రచురించరు కదా?" ధర్మసందేహం వెలిబుచ్చాను.

"నిజమే! కాని అటువంటి ఉత్తరాన్ని వాళ్ళు నాకు రీడైరెక్టు చేసే అవకాశం ఉంది. కనీసం నా నెక్స్‌ట్ కథల్లో అటువంటి తప్పును సరిదిద్దుకునేవాడ్ని." అతను సిన్సియర్‌గా చెప్పాడు. రైలు ఆగితే టాటా చెప్పి దిగిపోయాడు.

ఆ సంఘటన నేను అంత తొందరగా మర్చిపోలేకపోయాను. అందుకే నాకు నచ్చిన కథ పొగుడ్తూ ఉత్తరాలు రాయడం మొదలెట్టాను అప్పటి నుండి - నా స్థాయిని మర్చిపోయి. ఫీడ్ బ్యాక్ ముఖ్యమని ఆలస్యంగా తెలుసుకుని స్పందిస్తున్నాను- ఉత్తమ సాహిత్యాభివృద్ధి కోసం.

●

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక-----)